


**అ**నుకోకుండా ఆ చిలిపి ఆలోచన వచ్చింది జగన్‌కి. దాన్ని ఆచరణలో పెట్టడానికి మొదట్లో కాస్త తటపటాయించినా, చివరికి ఆ పని చేయడానికే నిర్ణయించుకున్నాడు. వెంటనే ఓ కాగితం, పెన్నూ తీసుకుని తన స్టడీరూంలో దూరాడు. ఒక గంట కుస్తీ పట్టాక, పని పూర్తయింది. ఒకసారి చదువుకుని తృప్తిగా 'నిట్టూర్చాడు'. వెంటనే ఆ కాగితాన్ని తన టేబుల్ మీదున్న పుస్తకంలో ఉంచి, సరిగా పేజీలసైజుకి కాగితాన్ని మడిచాడు.

**త**న ప్రయత్నం ఎంతవరకూ సక్సెస్ అయ్యిందో తెలుసుకోవాలంటే, దాన్ని తన మిత్రుడు నారాయణ దగ్గరే ప్రయోగించాలనుకుని, బైక్ తీసుకుని నారాయణ నడిపే స్టూడియో వైపు పోనిచ్చాడు.

నారాయణ ఫోటోగ్రాఫరే కాదు ఆర్టిస్టు. పైగా పుస్తకాల పురుగు. అదృష్టవశాత్తు 'పురుగు'గానే వుండిపోయాడు గాని, రచయితగా 'రూపాంతరం' చెందలేదు. కాని జగన్ మాత్రం 'రూపాంతరం' చెందినవాడు... అంటే పాఠకుడి నుండి కవిగా మారడం అన్నమాట.. కాని 'రూపాంతరాన్ని' ఏ పత్రికా ఇంతవరకూ గుర్తించలేదు. అది వేరే సంగతి...!

నారాయణ స్టూడియో లోనే దొరికాడు. పైగా ఖాళీగా ఏదో పుస్తకం చదువుతూ కనిపించాడు.

"ఈ కొత్త కవితా సంపుటి చూశావా?..." చేత్తో పుస్తకాన్ని చూపిస్తూ, నారాయణ కూర్చున్న టేబుల్ ముందరి కూర్చిలో కూర్చున్నాడు జగన్.

కూర్చోగానే ఒక కవితని చదవడం మొదలెట్టాడు. నారాయణ మౌనంగా వింటూ కూర్చున్నాడు. కవిత పూర్తి అయినా, ఏమీ అనలేదు. అనడానికి ముందు అర్థం కావాలి కదా!... అయితే, ఆ కవిత గురించి జగన్ ఏదైనా చెబుతాడేమోనని ఆశించాడు నారాయణ.

కానీ జగన్ మరో కవితని చదవడం ప్రారంభించాడు. ఇబ్బందిగానే వింటూ, దగ్గర్లోనే ఉన్న కుర్రాడికి 'రెండు టీ' అన్నట్టు వేళ్ళు చూపించాడు నారాయణ.

"ఎలా వున్నాయి రెండు కవితలూ?" అడిగాడు జగన్, చదవడం అపి.

"ఎలాగంటే?"... ఏం చెప్పాలో తెలియకన్నట్టు ఆగిపోయాడు నారాయణ.

"బాగున్నాయా?... బాగోలేదా?.. అని కాదు నా ఉద్దేశం... ఒకేలాగ వున్నాయా లేవా అని... అదే... శైలి, ఆ కవి తాలూకు ముద్ర... సొంతగొంతు వగైరా అన్నమాట..." అన్నాడు జగన్.

"ఒకే కవి రాసినవి ఒకేలా ఉండక... వేరే ఎలా ఉంటాయి?... పైగా బాగా చేయి తిరిగిన కవివి కదా!" అన్నాడు మామూలుగా నారాయణ.

"అయితే,, సక్సెస్!...గ్రాండ్ సక్సెస్!..." అని అరిచాడు జగన్, అప్పుడే వచ్చిన టీ కప్పుని అందుకుని, విజయసూచకంగా పైకెత్తాడు ఒకసారి. అర్థం కానట్టు చూశాడు నారాయణ.

"ఆ కవిత్వం లాగానే నీ మాటలూ అర్థం కావడంలేదు" అప్పటిదాకా ఆపుకున్న విసుగుని ఒక్కసారిగా వెళ్ళగ్రక్కాడు నారాయణ.

"చెబుతా— మొదటి కవిత 'ఆ కవి'ది, రెండోది ఈ 'అకవి'ది".. అని నవ్వాడు. "అకవి" అని తన మీద తనే జోక్ వేసుకున్నాడు జగన్.

తర్వాత కుర్చీలో వెనక్కి వాలి కూర్చుని, చెప్పడం మొదలెట్టాడు. "ఈ సంపుటిలో మొత్తం ముప్పై రెండు కవితలున్నాయి. అన్నీ ఎంత ఒళ్ళు దగ్గరపెట్టుకుని చదివినా ఒక్కటి... ఒక్కటంటే ఒక్కటి అర్థం కాలేదు. ఈ కవితలన్నీ ఇంతకుముందు ప్రముఖ పత్రికల్లో వచ్చినవే. అప్పుడు ఒకరిద్దరు కవి మిత్రులని

అడిగినా, ఒక్కరూ అర్థమైందని ధైర్యంగా చెప్పలేదు. నాకొక అనుమానం పట్టుకుంది. కనీసం ఇవి వీటిని ప్రచురించే పత్రికల వాళ్ళకైనా అర్థమవుతాయా అనేదే ఆ అనుమానం. ఆ సందేహం తీర్చుకోవాలనే ప్రయత్నంలో భాగంగానే, 'అచ్చం' ఆ కవిగారిలానే, ఏదో నా మనసుకి తోచినట్టు అర్థంపర్థం లేకుండా ఆ కవితని రాశాను. నా పేరుతో ఏ పత్రిక్కి పంపినా, 'బూమెరాంగ్' కావడం ఖాయం కాబట్టి, చిన్న ట్రిక్ ప్లే చేస్తున్నా. ఆ కవిగారి పేరుమీదే దీన్ని పంపిస్తున్నా".

"పత్రిక వాళ్ళకి అనుమానం రాదా?" మధ్యలోనే అడ్డుకున్నాడు నారాయణ.

"అందుకే చక్కగా టైప్ చేయిస్తా... హామీపత్రంతోసహా.. అయితే, చివర 'సంతకం' దగ్గరే వస్తుంది సమస్య.. అదీ నువ్వు 'సాయం' చేస్తే ప్రాబ్లెం తీరినట్టే!" అంటూ, కవిగారి కవితా సంపుటిలో ముందుమాట పేజీలో చివరగా ప్రింట్‌లో వున్న కవిగారి సంతకాన్ని చూపించాడు.

తాను చెయ్యాల్సిన సాయం ఏమిటో నారాయణకి అర్థమైంది. ఆర్టిస్టు అయిన నారాయణకి ప్రముఖుల చేతి రాతల్ని అనుకరించడం హాబీ. దీన్నే 'లిపి మిమిక్రీ' అంటాడు సరదాగా జగన్.

"అంటే ఆ కవిగారి సంతకం నేను చెయ్యాలన్నమాట!" నవ్వుతూ అడిగాడు నారాయణ

అవునని తలూపుతూ, "ఇందులో సమస్యలేమీ లేవు. మనం ఈ కవితని ఈ పుస్తకంలో ఉన్న 'ఆ కవి'గారి ఎడ్రెస్ ఇచ్చే పంపుదాం. ఈ అర్థం పర్థం లేని కవితని వేసుకున్నారా... వాళ్ళకి అర్థం కావడంలేదని నిర్ధారణ కొద్దాం. బుట్టదాఖలు చేశారా.. అర్థం అవుతున్నాయని భావిద్దాం!... ఏం అంటావ్?..." అన్నాడు జగన్.

నారాయణ ఒప్పుకున్నాడు. 'ఈ కవిత అచ్చవకూడదు తల్లీ!' అని సరస్వతీ దేవిని తల్చుకుని మరీ పంపారు ఆ కవితని.

* * *

పంపిన రెండు వారాలు తిరక్కుండానే, ఆ కవిత 'అకవి'గారి పేరన అచ్చయ్యింది, కవిత కంటే, అధ్వాన్నమైన చిత్రంతో సహా.

జగన్‌కీ, నారాయణకీ నవ్వాలో, ఏడవాలో అర్థం కాలేదు.

కవిగారు కూడా తను రాయని, "తన" కవితని చూశారు. ఇదేదో తన భక్తుడైన ఏ యువ కవి పనో అని అనుకున్నారు. ఇష్టకవుల పేరన, తమ కావ్యాల్ని చాటుపద్యాల్ని ప్రచారం చెయ్యడం మన ప్రాచీన సాంప్రదాయమేనని సరిపెట్టుకున్నారు. కవితని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించి, బద్ధకించి వూరుకున్నారు.

ఆంధ్రదేశం నలుమూలలనుండి కవిగారి అభిమానులు, కవిగారి కొత్త కవితని మెచ్చుకుంటూ ఉత్తరాలు రాశారు. ఆ ఏటి మేటి కవిత కాగలదని 'ఏకాక్షి' అనే సమీక్షకుడు కామెంట్ చేశాడు. విమర్శకులు కూడా ఎక్కడ తమకి ఆ కవిత అర్థం కాలేదనుకుంటారోనని, చాలా అర్థవంతమైన కవిత అంటూ తాము రాసే కాలమ్స్‌లోను,వేదికల మీదా పొగిడారు.

* * *

అయితే, జగన్‌చేసిన చిలిపి పని వల్ల పెద్దగా జరిగిన నష్టం ఏమీలేదు. కాకపోతే, తెలుగులో మరో అస్పష్ట- సంక్లిష్ట మహాకవి ఉదయించాడు.

## అడ్డు నిలిచావే హిమాలయ అడ్డుగోడలాగ...



కార్గిల్‌లో మీ కడగళ్ళు చూచి
కరిగిపోయెగా మా గుండె

కార్గిల్‌లో వడగళ్ళలా
శత్రువు తూటాలు కురిపిస్తుంటే
తటాలున దూకి అడ్డుగోడవైతివే!

కరగకుండా మంచుగడ్డ
కరకుగా కొరుకు తుంటె ఎముకల
చలించి చలికి వణకకుండా వణికించావే
చొచ్చుకువచ్చిన కిరాయి రౌతుల
నెట్టి తరిమి సరిహద్దు అవతల
అడ్డు నిలిచావే హిమాలయ అడ్డుగోడలాగ

నీ గోడు, గొడవ, ఒంటరిగ ఇంట వదిలినవారి గొడవ
ఇహ మా అందరిది, నీకు మరిలేదు కొదవ
నీవు మంచు గోడలపై వీరరక్తంతో కీర్తి చిందిన
మేము అశ్రు తర్పణంతో ఆర్తి అందించెదము
వీర జవానులకు హర్షతోరణంతో స్వాగతమిచ్చెదము

— జె.వి.రమణారావు